వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 21 అక్టోబర్ 2024

## సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వర్క్ షాప్

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:




సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో నిర్వహించిన భౌతిక, రసాయన శాస్త్ర, జీవ శాస్త్ర వర్క్ షాప్ నిర్వహించారు. ఫిజిక్స్ లో కాంతి పరావర్తనం, వక్రీభవణంకు సంబంధించిన ప్రయోగాలను చేసి చూపించారు. బయాలజీకి సంబంధించి ఏకదల బీజ, ద్విదల బీజ, కాండం వేరు ఆకు అడ్డుకోతలు మరియు కోడి ద్వారా టెండాన్, లిగమెంట్ మెదడు ధృక్నాడి మరియు జీర్ణవ్యవస్థను గురించి వివరించారు. ఫిజిక్స్, బయాలజీకి సంబంధించి 40మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు గోపినాథ్ రెడ్డి, నరసింహులు, తిరుమల కొండు సుబ్బనాయుడు, విజయమోహన్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి అల్లాబకాష్ పాల్గొన్నారు.

## సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కూలిన చెట్టు

మదనపల్లె, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఉన్న చింత చెట్టు ఆదివారం ఉదయం జాతీయ రహదారిపై కూలిపోయింది. సైకిల్‌పై వెలుతున్న చంద్రాచారి గాయపడగా తృట్టిలో ప్రాణాపాయ తప్పింది. సమాచారం అందుకొన్న వన్‌టౌన్ సిఐ చాంద్ బాషా, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రమణ్యం, టిడిపి యువనేత హరి ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అటవీశాఖాధికారి చెట్టును రోడ్డుపైన లేకుండా తొలగించారు.



# ఉపాధి నిధులు మిగులు - పల్లెల్లో ముగిసిన అభివృద్ధి పనుల పండుగలు





రాజంపేట,అక్టోబర్ 20,ప్రభాతవవార్త :

న...రే...గా... ఇక నేరుగా పనులకు లేదు ఇక ఎక్కడా అడ్డంకులు పల్లెల అభివృద్ధి పనులకు ఇక నేరుగా మిగుల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పల్లె పల్లెలో ప్రజా ప్రతినిధులు పల్లె పండుగల వారోత్సవాలలో భాగంగా పనులు ప్రారంభం. రాజంపేట తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌ల మెళికతో మంజూరైన నిధుల చిట్టాను మడతపెట్టవలసి వచ్చింది. నేరుగా పనులు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు నేరుగా పల్లెల్లో చేపట్టేందుకు సుముగం ఏర్పడింది. పల్లెల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలే చేపట్టి పలు అభివృద్ధి పనులతో పల్లెల ప్రగతి సాధించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 14 నుంచి 20 వ తేదీ వరకు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు రాష్ట్ర మంత్రులు సైతం పల్లెల్లో పండుగ వారోత్సవాలను నిర్వహించి ఆదివారంతో ముగించేశారు. ఈ వారం రోజుల పాటు పల్లెల్లో భూమి పూజలు, శంకుస్థాపనలు, సిసి రోడ్ల ప్రారంభ పనులను ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించి వారం రోజుల పాటు పల్లెల్లో ప్రజలకు పండగ వారోత్సవాల సంతోషాన్ని నింపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో 60శాతం కూలీలకు కేటాయిస్తే 40శాతం మెటీరియల్ కాంపొనెంట్ క్రింద ఉంచుతారు దీంతో కేంద్రం ప్రవేశపెట్టిన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 40శాతం మిగులు నిధులు రాష్ట్రంలో సుమారు రూ.4,500కోట్లు మిగిలాయి. గత ప్రభుత్వంలో ఈ నిధులను పల్లెల ప్రగతికి ఉయోగించకుండా ప్రక్కదారి మళ్ళించడంతో గ్రామాలలోని వీధులు అభివృద్ధికి నోచుకోక చినుకు పడితే చిత్తడై బురదమయమై రోడ్డు రొచ్చుగా మారి ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా చీదరించుకునే పరిస్థితుల్లో అనేక గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2015-16 సంవత్సరంలో ఈ పథకం ద్వారా మిగులు నిధులనే అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లకు ఉపయోగించడం జరిగింది. 2019 నుంచి 2024 వరకు ఆ ప్రభుత్వంలో మిగులు నిధులు ప్రజా ప్రయోజనాల కోసం అభివృద్ధి పనుల కోసం ఉపయోగించిన దాఖలాలు లేవు, 2024లో మళ్లీ తెలుగుదేశం అధికారంలోనికి రాగానే మొట్టమొదట పల్లెల అభివృద్ధిపై దృష్టి సారించి పండుగ వారోత్సవాల అనే పేరుతో గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టేందుకు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాకు రూ.71కోట్లు నిధులను కేటాయించి 30 మండలాల్లోని 503 గ్రామ పంచాయితీల్లో 772 పనులు కేటాయించి సిసి రోడ్ల నిర్మాణంలో చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ పనులు కూడా వీలైనంత త్వరిత గతిన పూర్తి చేయాలని పనులు చేసిన వారికి వారం పది రోజుల్లోపే బిల్లులు కూడా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన ఆదేశాలిచ్చినట్లు కూడా తెలుస్తోంది. అయితే రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో అధికార పార్టీ అయిన తెలుగుదేశంకు అధిష్టానం ఇంత వరకు ఇన్‌చార్జిలను నియమించకపోవడంతో ఇక్కడ పనుల పండుగ వారోత్సవాలకు ఇన్‌చార్జిల మెళిక పడి ఈ నియోజకవర్గాలకు కేటాయించిన నిధుల చిట్టాను మడతపెట్టినట్లు కూడా తెలుస్తోంది. కేంద్రం నుంచి వచ్చిన ఉపాధి హామీ మిగులు నిధులతో పల్లెల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి ఎంతో అభివృద్ధికి దోహదపడుతున్నట్లు తెలుస్తోంది ఈ నిధుల ద్వారా చేసుకునేవాడికి చేసుకున్నంత పని అన్న చందంగా పల్లె పల్లె అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం కలసి వచ్చిందనే చెప్పవచ్చు.

## మైనర్ హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

- నేరం జరిగిన 24 గంటల్లోనే ముద్దాయి అరెస్ట్
- 15 గంటలు మృత్యువుతో పోరాడి మృతి చెందిన దస్తగిరమ్మ
- బద్వేలు అటవీ ప్రాంతంలో పెట్రోలు పోసి హత్య యత్నాయత్నానికి పాల్పడిన విగ్నేష్
- నేరస్తునికి శిక్ష పడేలా చేస్తామన్న ఎస్పీ


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎస్పీ

కడప క్రైం, బద్వేలు, అక్టోబరు 20, ప్రభాతవార్త:

బద్వేలు రూరల్ పీఎస్ పరిధిలోని సెంచరీ ఫ్యాక్టరీ సమీపాన గల అడవుల్లో హత్యకు గురైన దస్తగిరమ్మ కేసులో ముద్దాయి విగ్నేష్‌ను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. హత్యకు గల కారణాలతో పాటు నిందితుడు హత్య చేసిన విధానాన్ని ఎస్పీ మీడియా సమావేశంలో వివరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఈ వివరాలు వెల్లడించారు. బద్వేలు రూరల్ పరిధిలో శనివారం 9 గంటల ప్రాంతంలో స్థానిక బిజివేముల వీరారెడ్డి కళాశాలలో నివాసం ఉంటున్న మైనర్ బాలిక హత్యకు గురైన విషయం తెలిసిందే. ప్రధాన కారణం డిగ్రీ కళాశాలలో స్థానికంగా ఉన్న విగ్నేష్ అనే యువకుడితో ప్రేమాయణం కొనసాగించింది. దస్తగిరమ్మ అప్పుడప్పుడు విగ్నేష్‌తో కలిసినప్పుడు వివాహం చేసుకోవాలని వేధిస్తూ ఉండేదని తెలిపారు. ఇదిలా ఉండగా గత 6 నెలల క్రితం విగ్నేష్‌కు మరో యువతితో వివాహం జరిగింది. అయితే దస్తగిరమ్మ తనను పెళ్లి చేసుకోవాలని విగ్నేష్‌ను వేధిస్తూ ఉండేది. ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలని శనివారం దస్తగిరమ్మకు ఫోన్ చేసి రమ్మనగా ఆమె 9 గంటలకు వెళ్లింది. ఇరువురు సమీపంలోని అడవిలోకి వెళ్లి అక్కడ వారి మధ్య గొడవ జరిగిందన్నారు. గత కొద్ది రోజులుగా విగ్నేష్ ఓంశాంతినగర్‌లో నివాసం ఉంటూ శనివారం ఆమెతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. కడప బైపాస్ ఆలంఖాన్‌సమీపంలో పెట్రోలు వేయించుకొని కొంత బాటిల్‌లో నింపుకొని ఆమెతో మాట్లాడి అనంతరం గొంతు నొక్కి స్పృహ కోల్పోగా పెట్రోలు పోసి నిప్పంటించాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఆమెను బద్వేలు ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. మృత్యువుతో పోరాడుతూ ఆమె ఆదివారం ఉదయం మృతి చెందింది. 80% కాలిన గాయాలతో ఉన్న సమయంలో పోలీసులకు తన మరణ వాంగ్మూలంలో విగ్నేష్ తనను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో గట్టిగా నిలదీయడంతో హత్య చేసేందుకు ప్రయత్నించాడని తెలిపింది. డీజీ ద్వారకా తిరుమలరావు ఆదేశాల మేరకు ఈ కేసు ఛాలెంజ్‌గా తీసుకొని ఒక ప్రత్యేకంగా 2 టీంలను ఏర్పాటు చేసి మైదుకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బద్వేలు సీఐ, సిబ్బందికి రాబడిన సమాచారం మేరకు ఆదివారం ముద్దాయిని అరెస్టు చేసి తగు చర్యలు నిమిత్తం అన్ని కోణాల్లో విచారించి మృతురాలికి సంబంధించిన వస్తువులు, నిందితుడి తాగి పడేసిన సిగరెట్ పీక స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నేరం జరిగిన గత కొద్ది గంటల్లోనే ముద్దాయిని అరెస్టు చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ముద్దాయిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ నాగభూషణం వారి సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్రహారం వాసులకు అగచాట్లు

- అనువైన చోట్లకు అడ్డంకులు







రాజంపేట,అక్టోబర్ 20,ప్రభాతవవార్త :

ఆంధ్రరాష్ట్రాన్ని ప్రపంచ చిత్రపటంలోనికి ఎక్కించిన ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారి పల్లె మండలం మంగంపేటకు చెందిన అగ్రహారం వాసుల అగచాట్లు గత రెండున్నర దశాబ్ద కాలంగా పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేడు అత్యంత విలువైన ముగ్గురాయి ఖనిజాన్ని అందించే ప్రధానమైన గనే అగ్రహారం గ్రామం. ఆ గ్రామ వాసులు ఎన్నో తరాలుగా అనుభవిస్తున్న స్థిర, చెరాస్తులను ముగ్గురాళ్ల గన అభివృద్ధి కోసం దారాదత్తం చేసి ఎంతో అతి పెద్ద హృదయాలతో వదిలి వేళ్లారు. వారి దాతృత్వంతో వదిలిన ప్రాంతంలో నేడు అత్యంత విలువైన ఖనిజ సంపదను ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ వెలికి తీస్తుంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి వందలే కాదు వేల కోట్ల ఆదాయాన్ని కూడా గడించి పెడుతుంది. దీంతో రాష్ట్రంలోని మారు మాల పల్లెలె సైతం అభివృద్ధి చెందాయంటే ఎలాంటి సందేహం లేదు. అయితే ఇంత దాతృత్వానికి పాటు పడిన అగ్రహార వాసుల పరిస్థితి నేడు ప్రాణాలు సైతం కోల్పోయి దయనీయంగా తయారైంది. వీరిని సురక్షితమైన పునరావాస ప్రాంతానికి అన్నీ అడ్డంకులే, అందరూ అడ్డుతగిలే వారే.. వీరిని మొట్టమొదటగా తరళించే సమయంలో సంస్థ యాజమాన్యం కానీ ప్రభుత్వ అధికారులు గానీ ముందుస్తు అవగాహన లేకుండా గని ఒడ్డునే పునరావాసాలు కల్పించారు. నేడు ఆ గ్రామం పరిస్థితి గని క్రింద గ్రామం పైన అన్న చందంగా వారు చేసే డ్రిల్లింగ్ పనులతో వెదజల్లే కాలుష్యం వారు చేపట్టే గనుల్లోనే హెవీ బ్లాస్టింగ్ భీతెల్లే భాంబుల శబ్దాలతో ఇళ్ల దద్దరిల్లి నెర్రెలు బారి వారిని భయభ్రాంతులకు గురి చేస్తుంది. రెండున్నర దశాబ్ద కాలంగా గనుల విస్తరణ కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో మంది ధ్వని శబ్దాలకు ఇళ్ల కూలి కాలుష్యం కబలించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ ఉన్నవారు సంస్థ, అందరి అభివృద్ధి కోసం రాష్ట్ర బాగోగుల కోసం గని కుంపటిని నెత్తికెత్తుకొని నేటికీ మోస్తుందంటే అగ్రహారం వాసుల అగచాట్లతో కూడిన దాతృత్వమేనని చెప్పవచ్చు ఇలాంటి గ్రామస్థులను ఇటీవల మూడు గ్రామాలైన కాపు పల్లె, రెండు దళితవాడలకు కేటాయించిన పునరావాస స్థలాల ప్రక్కన సురక్షితమైన స్థలాలిచ్చేందేకు కూడా అందరూ అడ్డు చెప్పడం అధికారులు వారికి అనువైన చోట ఇచ్చేందుకు సహకరించకపోవడం దారుణంగా ఉంది. ప్రభుత్వాధికారులు ప్రజా ప్రనిధులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న అగ్రహారం వాసులకు అనువైన చోట పునరావాస స్థలాలు కల్పించాలని ప్రాదేయపడుతున్నారు.

## 21 నుంచి 31 వరకు పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు

- జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు

కడప క్రైం, అక్టోబరు 20, ప్రభాతవార్త:

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా నిర్వహించే పోలీసు అమర వవీరుల స్మారకోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 31 వరకు జిల్లా అంతటా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో గల ముఖ్యమైన కూడళ్లలో, పబ్లిక్ ప్రదేశాల్లో అమర వీరులను స్మరిస్తూ 21 నుంచి 31 వరకు హోర్డింగ్స్, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. 24 నుంచి 27 వరకు సినిమా హాల్లో, లోకల్ టీవీ చానళ్లు, దినపత్రికల్లో ప్రచారం, 24 నుంచి 27 వరకు కళాశాల, సిబ్బంది పిల్లలకు వ్యాసరచన పోటీలు, 28న ఉచిత వైద్య శిబిరం, 31న కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది.

## సోములవారి పల్లె అభివృద్ధికి 12లక్షల నిధులు

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:



సోములవారి పల్లె పంచాయతీ ఈశ్వర రెడ్డి నగర్ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో 12లక్షల అంచనా వ్యయంతో పాఠశాల ప్రహరీ గోడ మరియు సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఆదివారం మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌లు రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. అందులో భాగంగా సోములవారి పల్లె గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద సుమారు 12లక్షలకు భూమిపూజ నిర్వహించామని, మరో 15లక్షల నిధులు పెన్నానగర్‌లో పనులకు మంజూరు చేశారని వివరించారు. వాటికి సంబంధించి ముందుగా సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గ్రామ పంచాయతీలు బలోపేతం చేయాలన్నా సంకల్పంతో ఉపాధి హామీ నిధులను గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ నిధులను పంచాయతీల అభివృద్ధికి కాకుండా పక్కదాని పట్టించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి, శేఖర్, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, వార్డు మెంబర్ గోటూరు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈఈ గణేష్, డిఈ లక్ష్మి నారాయణ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దుర్గా అంజన్, స్థానిక టీడీపీ నాయకులు భీమచర్ల రామచంద్రా రెడ్డి, పల్లేటి రామకృష్ణా రెడ్డి, ఉలసాల గంగాధర్, పగిడేల సుబ్బారెడ్డి, ఆటో శ్రీను, షామీర్, షరీఫ్, మోహన్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం, దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



ప్రొద్దుటూరు, అక్టోబర్ 20, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణం మట్టి మసీద్ వీధి నందు "దస్తుమియా అండ్ సన్స్" షేక్ ఖాదర్ వలీ ఆధ్వర్యంలో ఘనంగా గ్యార్మి జెండా పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అంజుమన్ కమిటి అధ్యక్షుడు వి.యస్ ముక్తియార్ చేతుల మీదుగా మత పెద్దల సమక్షంలో ప్రార్థనలు చేసి మట్టి మసీదు వీధిలో ఉండే ప్రజలందరికి అన్నదానం, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవ సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్యారిమీ పండుగ సంధర్భంగా దివ్యాంగులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న షేక్ ఖాదర్ వలీ ఎల్లప్పుడూ సమాజ సేవ కార్యక్రమాలకు ముందు ఉంటారని కృతజ్ఞతలు తెలిపారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు దేవుని ఆశీస్సులు, చల్లని దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు రషీద్, ఖాజామైనుద్దీన్, సంజీవ్‌కుమార్, డిస్కో రమణయ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయజ్యోతి

బద్వేలు , అక్టోబర్ 20 ప్రభాతవార్త:




బద్వేలు పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన విద్యార్థిని దస్తగిరమ్మ మృతిపై కడపజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థికి నిప్పంటించి హత్య చేసిన నిందితుడు విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. సమాజంలో ఇలాంటి మానవ మృగాలను కూకటివేళ్లతో పెకలి ం చాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు మరళా పునరావృతం కాకుండా చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో ఇలాంటి దారుణాలు జరగకుండా వారిని ఉరితీయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, అక్టోబరు 20, ప్రభాతవార్త:



ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 21న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. అక్కడ పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

## విద్యార్థిని మృతితో విషాధచాయలు

బద్వేలు, అక్టోబర్ 20 ప్రభాతవార్త:


దస్తగిరమ్మ (ఫైల్‌ఫొటో)



పట్టణంలోని రామాంజనేయ నగర్‌కు చెందిన విద్యార్థిని దస్తగిరమ్మ మృతితో ఆ వీధిలో విషాధచాయలు అలుముకున్నాయి. శనివారం దస్తగిరమ్మపై అదే వీధికి చెందిన విఘ్నేష్ పట్టణంలోని సమీప అటవి ప్రాంతంలోకి తీసుకెళ్లి పెట్రోలు పోసి నిప్పంటించిన విషయం విధితమే. కాగా 80 శాతం కాలిన గాయాలతో కొట్టుమిట్టాడుతున్న బాలికను మెరుగైన చికిత్సకై కడప రిమ్స్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ ఆమె ఆసుపత్రిలోనే మృతి చెందింది. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. తల్లి,తండ్రి దస్తగిరమ్మ మృతదేహాన్ని చూసి స్పృహ కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మృతురాలు దస్తగిరమ్మకు ఎంతో మంచి భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో ఒక మానవ మృగానికి బలి కావడం బాధాకరమంటూ పలువురు విఘ్నేష్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఎంతో భవిష్యత్తు ఉన్న దస్తగిరమ్మ తల్లిదండ్రులకు చేదోడు,వాదోడుగా ఉండాల్సిన కన్న కూతురు ఇలా చనిపోవడం పట్ల జీర్ణించుకోలేకపోతున్నారు. మాయమాటలతో ఆడపిల్లలను మాయచేసి ఏదో చేయాలనే ఇలాంటి క్రూరుడికి ఎలాంటి శిక్ష వేసినా తక్కువేనని అన్ని పార్టీల నాయకులు, ప్రజాసంఘాల వారు మండిపడుతున్నారు. అమ్మాయి ఎంతో తెలివైనదని విద్య పట్ల పట్టు ఉండేదని, స్థోమత లేక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతశిఖరాలకు చేరి అందరి మన్నన్నలు పొందాలనుకున్న తరుణంలో ఒక మాయగాడి మాటలకు బలైందని విద్యాబోధనలందించిన ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. పట్టణమంతా ఎక్కడచూసినా దస్తగిరమ్మ అంశమే తెరపైకి వస్తోంది. ఇలాంటివారిని నడిరోడ్డులో ఉరితీయాలని ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేయకపోతే ఎంతోమంది దస్తగిరమ్మ లాంటి బాలికలు మానవమృగాలకు బలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తగిరమ్మ మృతదేహాన్ని చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.



# దారి చూపని దొరలు - రోడ్డెక్కిన మురుగు

**వీరబల్లి, అక్టోబర్ 20,ప్రభాతవవార్త :**

వీరత్వం కలిగిన దొరలున్న వీరబల్లికి వీదిరోడ్లే అద్వాన్నంగా ఉన్నాయి. చినుకు పడితే చిత్తడై బుదరమమౌతాయి. ఇక్కడున్న వీరుల వీరత్వ చూస్తే వీరికి ఎంత భలాలున్నాయో వీధుల్లో అపరిశుభ్రతకు కూడా అంతే భలం ఉందని చెప్పవచ్చు. ఇది ఎక్కడో కాదు వీరబల్లి మండల కేంద్రంలోని బ్యాంకు పోలీస్ స్టేషన్‌ల ముందే రొచ్చుతో కూడిన రోడ్డు కనపడుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పైన ఉన్న నీళ్లన్నీ వెళ్లేందుకు డ్రైనేజి కాలువ లేక బబ్యాంకు నిండిపోయాయి.ఎక్కడా బ్యాంకులో ఉన్న డబ్బు తడుస్తుందోనని బ్యాంకు శాఖ అధికారులు ఈ వర్షాకాలంలో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే అందరూ వారంటే భయపడే రక్షకబటులున్న పోలీస్ స్టేషన్ ఎదుట మురుగు నీరు పోలీసులనే అడుగుపెట్టేందుకు భయపడేటట్లు చేస్తున్నాయి. ఎదో సీరియల్‌లో మీ నాన్నంటే ఎంత పెద్ద వాళ్లే భయపడుతారు అలాంటి వారికి ఈ దోవలెందుకు భయపడవు నాన్నా అన్న చందంగా పోలీస్ స్టేషన్ ఎదుట మురుగు దర్శనం ఇస్తుంటే ప్రజలను లెక్కపెట్టని పంచాయితీ అధికారులు కనీసం పోలీసులకు కూడా భయపడలేదంటే వీరబల్లిలో ఆ పంచాయితీ అదికారులకు ఆ వీరబల్లి దొరల అండ ఎంతుందో పోలీసులకే భయపడకుండా వాటి ఎదుట కనబడుతున్న మురుగే చెబుతుంది. వీరి పరిస్థితి ఇలా ఉంటే ప్రధాన రహదారి అయిన ఈ రోడ్డు పై నడిచే ప్రజల పరిస్థితి అక్కడ నివశించే వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో దీన్ని చూస్తేనే తెలుస్తోంది. గత నాలుగు రోజుల పాటు కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు జిల్లా స్థాయి అధికారులే పల్లెల్లో పర్యటించి ప్రజలకు మనోధైర్యాన్ని నింపుతూ అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేటట్లు అలర్టు కూడా చేయడం జరిగింది అయితే



వీరబల్లి మండల కేంద్రంలో వర్షం వెలసి నాలుగురోజులైనా రోడ్డు పైన ఉన్న రొచ్చును గురించి పట్టించుకున్న పంచాయితీ అధికారులే లేరంటే ఆ శాఖకు సంబంధించిన అధికారులు ఈ మండల కేంద్రంలోనూ వీరబల్లి పంచాయితీలోనూ ఉన్నట్లా లేనట్లా అన్నది ప్రజలకే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎవరైనా స్పంధించకపోయినా ఏదైతే జరిగితే ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తారు. అలాంటి నిత్యం ప్రజలు అవసరాల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తన ప్రక్కనే ఉన్న భ్యాంకుకు నీళ్లల్లోనూ బురదలోనూ తొక్కుకుంటూ వెళుతుంటే ఇలాంటి దుర్భరమైన పరిస్థితులను పోలీసులే అనుభవించి మౌనంగా ఉండడం చూస్తుంటే ఆ వీర దొరలపై వీరికి కూడా పట్టినట్లే ఉందేమో నన్న అనుమానాలు కూడా ప్రజల్లో గుసగుసలాడుతున్నాయి. వీరబల్లిలో ఉండే వీర రాజుల వీరంగం అపరిశుభ్రతకు చేయుతనివ్వడం కాదు, శుబ్రతను పాటించి ప్రజలకు చేయుతనిచ్చి వీరరజుల అభివృద్ధి వీరత్వాన్ని వీరబల్లిలో చాటుకోవాలని అటు అధికారులు, పోలీసులు ప్రజలు బయటకి పొక్కలేకనే చెవులు కొరుక్కొంటున్నారు. కూత వేటు దూరంలోనే ఉన్న జిల్లా పంచాయితీ అధికారులు స్పంధించి శుభ్రతను పాటించి ప్రజలకు వ్యాధులు సోకకుండా కాపాడాలని కోరుకుంటున్నారు.

# ఉల్లికి తెగుళ్లు-రైతుల ఆందోళణ

**దువ్వూరు, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలో వివిధ గ్రామాల్లో సాగు చేసిన కేపీ ఉల్లి పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. గత నాలుగు రోజులుగా కురిసిన వర్శాలతో కేపీ ఉల్లి పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మూడిళ్లపల్లె, చిన్న సింగనపల్లె, నీలాపురం, మదిరేపల్లె, చల్లబసాయి పల్లె తదితర గ్రామాల్లో సుమారు 2000ఎకరాల్లో కేపీ ఉల్లి పంట ను సాగు చేశారు. ఈ ఉల్లి పంట దిగుబడి వచ్చిన తర్వాత విదేశాలకు ఎగుమతి చేస్తారు. అటువంటి ఉల్లి పంటకు తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేని వర్శాలు రావడంతో పూర్తిగా దెబ్బతిన్నది. ఉల్లి పంటకు సంబంధించిన ఆకులు తెల్లగా మారి భూమికి కర్సుకుంటున్నాయని రైతులు వాపోయారు. అలాగే కేపీ ఉల్లి గడ్డ వద్ద కుల్లు వచ్చి పంట పూర్తిగా నాశనం అవుతుందన్నారు. దీంతో రైతులు ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అలాగే పెద్ద బళ్లారి రకం ఉల్లి పంటను కూడ మండలంలో సాగు చేశారు. రామాపురం, మీర్జఖాన్ పల్లె, గుడిపాడు తదితర గ్రామాల్లో సుమారు 600ఎకరాల్లో పెద్ద బళ్లారి ఉల్లి పంటను సాగు చేశారు. 10రోజుల్లో దిగుబడి వస్తుంది. దిగుబడి వచ్చే సమయంలో వర్శాలు రావడంతో పెద్ద బళ్లారి ఉల్లి పంట కూడ దెబ్బతింది. పూర్తిగా ఉల్లిగడ్డలు కుల్లి పోతున్నాయని రైతులు వాపోయారు. సుమారు క్వింటాలు ధర 3800రూపాయలు ఉండగా ప్రస్తుతం పెద్ద బళ్లారి పంటను 1000రూపాయలకు కూడ అడగటం లేదని రైతులు వాపోయారు. ఈ పంట చేతికి వచ్చే సమయంలో వర్శాలు రావడంతో కేపీ ఉల్లి పెద్ద బళ్లారి ఉల్లి రకం పంటలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. సుమారు ఎకరాకు 70వేల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన ఉల్లిపంట ప్రస్తుత పరిస్థితిని చూస్తే దిగుబడులు అంతంతమాత్రమే వస్తాయని దీంతో నష్టాలు కూడ రావచ్చని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉల్లిపంట



తెగుళ్ల బెడద ఎక్కువైనందునఉద్యానవణ శాఖకు సంబంధించిన అధికారులు మండలంలో పర్యటించి కేపీ ఉల్లిసాగు చేసిన రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ఉద్యానవన శాఖ అధికారులు పర్యటించాలని ఉల్లి రైతులు కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటారని బావిస్తాం.

# మట్కా, జూదాలను అరికట్టేందుకు కృషి - డీఎస్పీ మురళినాయక్

**- రెండు నెలల్లో పలు కేసులో ఛేదించాం**

**- కార్డెన్‌సెర్చ్‌లో 50లీటర్ల సారా, 20 వాహనాలు సీజ్**

**- కెమెరాల ఏర్పాటులో షాపు యజమానులు సహకారం అందించాలి**

**పులివెందుల, అక్టోబరు 20, ప్రభాతవార్త ః**

పులివెందుల ప్రాంతంలో ప్రధాన సమస్యలుగా ఉన్న మట్కా, గ్యాంబ్లింగ్‌లను అరికట్టేందుకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎస్పీ మురళినాయక్ అన్నారు. పులివెందులలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 150 కెమెరాల దాకా అవసరం ఉన్నాయని, ఖర్చుతో కూడుకున్న పని అయినందున తీవ్రతను బట్టి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కెమెరాలు ఏర్పాటు చేసేందుకు షాపుల యజమానులు కూడా రోడ్లు కవరయ్యేలా ప్రతి షాప్ నందు రోడ్డు వైపు కెమెరాను ఏర్పాటు చేసి పోలీసులకు నేరాలు జరగకుండా సహకరించాలని కోరారు. గత రెండు నెలల నుండి పులివెందులలో పలు కేసులను ఛేదిచామని, ముఖ్యంగా వైన్‌షాపు నందు నాలుగు లక్షల చోరీ జరగగా ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి సొమ్మును కూడా రికవరీ చేశామన్నారు. ఐదు ఇళ్లల్లో దొంగతనాలు జరగగా ఒక దొంగతనంలో నిందితుడిని అరెస్టు చేసి పోయిన సొమ్మును రికవరీ చేశామన్నారు. అలాగే గొర్రెల దొంగతనంలో కూడా నిందితులను గుర్తించి కేసును కూడా ఛేదించామన్నారు. బయటి ప్రాంతం నుండి పులివెందుల ప్రాంతంలో దొంగతనాలు చేసే వ్యక్తుల నుండి దాదాపు 8 సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురు సీఐలతో, ఐదు మంది ఎస్సైలు, 150మంది సిబ్బందితో కలిసి పట్టణంలోని నగరిగుట్ట నందు కార్డెన్‌సెర్చ్ చేశామని, ఇందులో 50లీటర్ల నాటుసారా, పత్రాలు లేని 20 బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒక మట్కా బీటరును కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. గత రెండు నెలల నుండి పులివెందులలో పలు నేరాలలో పురోగతిని సాధించామని, ఇకముందు కూడా గట్టిగా నిఘా ఉంచి నేరాలు జరగకుండా అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు. పులివెందుల ప్రధాన సమస్య అయిన మట్కా, గ్యాంబ్లింగ్ అరికట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.



# అక్రమ రవాణాకు వ్యతిరేకంగా..

**ఏడేళ్ల పాప ఆరుబయట ఆడుకుంటూ కనిపించకుండా పోయిందని ఒకరు. స్కూలుకెళ్లిన బాబు ఇంటికి రాలేదని తల్లడిల్లిపోతోన్న తల్లి మరొకరు తమ బిడ్డల జాడ తెలుసు కోమంటూ పల్లవిని ప్రాధేయపడుతుంటారు. వాహనంలో తరలిస్తోన్న పిల్లల్ని చూశామని కొందరు.. చిత్రహింసలకు గురవుతోన్న చిన్నారుల ఆచూకీ చెప్పేవారు ఇంకొందరు. ఆ వివరాలు ఆవిడకే ఎందుకు చెబుతారు?**

ఇంతకీ ఎవరీమె. ఆమె వారినెలా కాపాడుతుంది?

పల్లవి ఘోష్ హ్యూమన్ ట్రాఫికింగ్ కార్యకర్త. తప్పిపోయిన పిల్లల ఆచూకీ తెలుసుకోవడం, ప్రభుత్వాధికారుల సాయంతో అక్రమ రవాణాదారుల ఆటకట్టించడం, బయటపడినవారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ఆమె దినచర్య. బెంగాల్‌కి చెందిన పల్లవి కుటుంబం అసోంలోని లుమ్‌డింగ్‌లో స్థిరపడింది.అప్పటికి ఆమెకు పదమూడేళ్లు ఉంటాయేమో! సెలవుల్లో మేనమామ ఇంటికెళ్లింది. అప్పుడు చూసిందో సంఘటన. కిడ్నాప్ అయిన కూతురిని వెతుక్కుంటూ ఇల్లిల్లూ వెతుకుతోన్న ఓ తండ్రి వేదన అది. ఆ చిన్న వయసులోనే అది చూసి కదిలిపోయిన పల్లవి. తనవంతుగా ఆ అమ్మాయి జాడ తెలుసుకునే ప్రయత్నం చేసింది. తను దొరకలేదు కానీ, ఆ ఘటన మాత్రం పల్లవి మనసుపై చెరగని ముద్ర వేసింది. తన కెరియర్ మార్గాన్నే మార్చేసింది. ఉన్నత చదువులకోసం పల్లవి ఢిల్లీ చేరింది. ఇక్కడ డిగ్రీ చేశాక, చెన్నైలో 'జెండర్ ఇష్యూస్' మీద పిజి చేసింది. ఆపై హ్యూమన్ ట్రాఫికింగ్ నిరోధానికి పనిచేసే 'శక్తివాహిని' అనే ఎన్జీవోలో వాలంటీరుగా చేరింది. తరవాత మరికొన్ని సేవా సంస్థల్లోనూ పనిచేసింది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో దారుణ పరిస్థితులెన్నో ఆమెకు కనిపించాయి. ముఖ్యంగా పశ్చిమ్‌బంగ, ఈశాన్య రాష్ట్రాల నుంచి మహిళల్ని ఢిల్లీలో పని మనుషులుగా అమ్మేస్తున్నారని తెలిసి ఆశ్చర్యపోయింది. తరవాత అలాంటి వారినెందరినో గుర్తించి విడిపించింది. ఇక రాజస్థాన్, హరియాణాలది మరో రకమైన పరిస్థితి. బెంగాల్, అసోం, నాగాలాండ్ వంటి రాష్ట్రాల నుంచి మహిళలను ఎత్తుకొచ్చి వయసుతో సంబంధం లేకుండా అక్కడి వాళ్లకిచ్చి పెళ్లిళ్లు చేస్తున్నారు. గ్రామాల్లో ఈ విషయం అందరికీ తెలిసినా ఎవరూ నోరు మెదపరు. అడ్డుకోరు. ఇక్కడి నుంచి వీరిని బయటకు తీసుకు రావడానికి ఎంతో సాహసం చేయాలి అనే పల్లవి శక్తివాహినిలో ఏడేళ్లు పనిచేశాక 2020లో సొంతంగా 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్' అనే ఎన్జీవో స్థాపించి అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టింది.



**దాడులెన్నో ఎదుర్కొని...** బందీలుగా మారిన ఆడపిల్లలను ఇళ్లు, వ్యభిచార గృహాల నుంచి విడిపించడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది పల్లవి. కొన్నిసార్లు ఈ ముఠాలు భౌతికదాడులకూ దిగాయి. ఎన్నో సార్లు చావునుంచీ తప్పించుకుంది. ఓ వ్యక్తి కోర్టు హాలులోనే కత్తి చూపించి బెదిరించాడు. 'నిజానికి చాలామంది ట్రాఫికింగ్‌ని అడ్డుకోవడం, దాన్ని ఛేధించడడం సాహసోపేతమైన దని నమ్ముతారు. కానీ, దానికంటే బాధితులను గుర్తించే ప్రయాణమే కష్టతరమైంది అనే పల్లవి.. ఇందుకోసం సమస్య తీవ్రంగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లోనూ అవగాహనా సదస్సులు నిర్వహిస్తోంది. ఊరూరా తిరిగి వివిధ వర్గాల మహిళలు, స్కూలు విద్యార్థినులకు మానవ అక్రమ రవాణా గురించి చెబుతోంది. అలాంటి పరిస్థితులను గుర్తించి స్పందించేలా.. రిక్షావాళ్లను, క్యాబ్ డ్రైవర్లను, ఆటోవాళ్లను చైతన్యపరుస్తోంది. ఎందుకంటే ఆడవాళ్లను ఎత్తుకుపోవాలంటే వీరి ద్వారానే పోవాలి. వీరు ఆపగలిగితే సగం కేసులు ఆగిపోతాయి అని చెబుతోంది.

**కొత్త జీవితాన్నిస్తోంది...** ఆడపిల్లల అక్రమ రవాణాను నిరోధించడం ఒకెత్తయితే వాళ్లని కాపాడి తీసుకొచ్చాక వారికి కొత్త




జీవితాలు ఇవ్వడం మరొకెత్తు. సామాజిక దురాచారాలు, పేదరికం, నిరుద్యోగం, వలసలు, నిరక్షరాస్యత వంటి ఎన్నో సమస్యలు ఈ మానవ అక్రమ రవాణాకు దారితీస్తున్నాయి. ఇక, బాదితుల గురించి తెలిసినప్పుడు.. ఐపిసి(ట్రాఫికింగ్) సెక్షన్ 370 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు బుక్ చేయమని పోలీసు అధికారులను ఒప్పించడం, మిస్సింగ్ కేసుల డేటాను సంపాదించడమూ అంత తేలికేం కాదంటారామె. 'అక్రమ రవాణా నుంచి బయటపడ్డాక కూడా బాధిత మహిళలు సమాజం నుంచి ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొందరు కుంగుబాటుకి గురై ప్రాణాలూ తీసుకుంటుంటారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆత్మస్థైర్యాన్ని నింపాలి. నేతపని, ఊలు అల్లడం, కుట్టు పని, కంప్యూటర్ స్కిల్స్, ఇంగ్లిష్ కోర్సులు నేర్పించి.. వారి కాళ్లపై వారు నిలబడేలా చేస్తాం. స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేసి సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు అవసరమైన చేయూతనందిస్తాం. వాళ్ల పిల్లల్ని పాఠశాలలకు పంపిస్తున్నాం. ఇలా ఇప్పటివరకూ పదివేలమందికిపైగా అక్రమరవాణా బాదితులకు అండగా నిలిచాం. ప్రజల్లోనూ మార్పు వస్తే మరింతమందికి సాంత్వన కలిగించొచ్చు అంటోంది పల్లవి.

## కూటమి పాలనలో అనారోగ్య ప్రదేశ్‌గా ఏపీ

**- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**వేంపల్లె, అక్టోబరు 20, ప్రభాతవార్త ః**



టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్ అయిందని, రాష్ట్రంలో పారిశుధ్య పడకేసిందని, శాంతిభద్రతలు క్షీణించాయని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. డయేరియాను అరికట్టలేని దద్దమ్మ ప్రభుత్వంగా తయారైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్, జూలై మాసాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రులు డయేరియాతో కిటకిటలాడాయని, ఆరు మంది చనిపోయారన్నారు. ఆగస్టులో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యాలు విజృంభించాయని అన్నారు. ప్రస్తుతం మళ్లీ డయేరియా విజృంభించి విజయనగరం జిల్లా గుర్ల మండలంలో దాదాపు 450మంది డయేరియాతో బాధపడుతున్నట్లు తెలిపారు. 8మంది చనిపోయారన్నారు. తాగునీరు కలుషితం కావడం, పారిశుద్ధ్యం లోపించడమే ఇందుకు ప్రధాన కారణమని, సంబంధించి మంత్రులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా సనాతన ధర్మం గురించి మాట్లాడడం మానుకుని మంత్రి ధర్మంపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయన్నారు. బాలికలకు, మహిళలకు రక్షణ లేదన్నారు. కడప జిల్లా బద్వేలులో దస్తగిరమ్మ అనే విద్యార్థినిపై విగ్నేష్ అనే యువకుడు పెట్రోలు పోసి నిప్పంటించడం దారుణం అన్నారు. కడపలో టీడీపీ కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి మీద కొందరు వ్యక్తులు కర్రలతో పట్టపగలు దాడి చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలు, పారిశుద్ధ్యం, ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల మీద దృష్టి పెట్టాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి

**వేంపల్లె, అక్టోబరు 20, ప్రభాతవార్త ః**



గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి అని, అందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారని వేంపల్లె మండల టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లె మండలంలోని ఇడుపుల పాయ ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులతో కలిసి పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ ఏచశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం చంద్రబాబు దృష్టి సారించారన్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలని, ఆ గ్రామాల్లో కనీస వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా దాపురించాయన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయని కారణంగా అధ్వాన స్థితిలో ఉన్నాయని, నేడు సీఎం చంద్రబాబు సారథ్యంలో గ్రామ పంచాయతీలు ప్రగతిబాట పట్టాలయని, విజన్ కలిగిన చంద్రబాబు మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండడం అదృష్టం అన్నారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి నియోజకవర్గంలోని అన్ని మండలాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ శ్రీనివాసులు, ఏపీవో షాలిని, టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, సీనియర్ నేత మహమ్మద్ షబ్బీర్, జనసేన అధ్యక్షుడు డాక్టర్ హరీష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా, టీడీపీ నాయకులు వెంకటస్వామి, చెంద్రాయుడు, లక్ష్మణ, వీరభద్ర, తెలంగాణ వలి, మహమ్మద్, వేమాకుమార్, డక్కా రమేష్, జబీబుల్లా, కిషోర్, మడకా శ్రీను, గణేష్‌నాయక్, రాజానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

**- మానవత ఛైర్మన్ చక్రపాణిరెడ్డి**

**వేంపల్లె, అక్టోబరు 20, ప్రభాతవార్త ః**



ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా మానవత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఛైర్మన్ బి.చ క్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వంశీవిహారి, డాక్టర్ సాయిచరిత, డాక్టర్‌శివబాబు, డాక్టర్ యోగేశ్వరబాబులు వైద్య సేవలు అందించారు. మానవత సభ్యులందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు రామమునిరెడ్డి, డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కావలి క్రిష్ణతేజ, చల్లా బాలాజి, పోతిరెడ్డి శ్రావణ్, గోపి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కడప జిల్లా అవోపా ప్రమాణస్వీకారం

**వేంపల్లె, అక్టోబరు 20, ప్రభాతవార్త ః**



కడప జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ప్రమాణస్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగిందని అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు తెలిపారు. చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రంలో ఉన్న శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో కడప జిల్లా అవోపా ప్రమాణ స్వీకారం నిర్వహించారు. జిల్లా అవోపా అధ్యక్షుడిగా గూడూరు హరికృష్ణను రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఉప కార్యదర్శులు, కోశాదికారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారంచేశారు. అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థనా గీతంతో ప్రారంభించగా, పులివెందుల అవోపా అధ్యక్షుడు మేడం దినేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గండి శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు రాయవరం శివరావు, అధ్యక్షులు పచ్చిపులుసు మురళీకిషోర్, వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, వేంపల్లె అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్‌కుమార్, అవోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర రీజనల్ ఉపాధ్యక్షుడు అంబికేశ్వరశెట్టి, వేంపల్లె అవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, ఉపాధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి, కార్యదర్శి గోనుగుంట్ల సంధ్యారాణి, కడప జిల్లాలోని అవోపా యూనిట్లు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### జొన్న, సొద్ద రొట్టే కదా అని

# తేలిగ్గా తీసుకోకండి

**- పోషక విలువలు అధికమంటున్న పరిశోధకులు**

**- పట్టణంలో విరివిగా రూ.20కే జొన్న, సొద్ద రొట్టె లభ్యం**

**రాయచోటి, అక్టోబరు 20, ప్రభాతవార్త:**



మధుమేహులకు మంచిదంటున్న డైటీషియన్లు, పోషక విలువలు అధికమంటున్న పరిశోధకులు. జొన్న తింటే ఆరోగ్యం మిన్న, జొన్న సొద్ద రొట్టెలను ఒకప్పుడు పేదలు తినే ఆహారం. వరి అన్నం ఫేమస్ అయ్యాక వారు జొన్నల వినియోగం తగ్గించారు. పల్లెల్లో ఇప్పటికీ చాలా ఇళ్లల్లో ఆహారంగా తీసుకునేది జొన్న రొట్టేనె. బి.కాంప్లెక్సు విటమిన్స్‌కు తోడు ఫైబర్, విటమిన్ ఏ, సి, క్రూడ్ ప్యాట్, అమినో యాసిడ్స్ ఇలా అత్యవసర పోషకాలు అధికంగా ఉండే ఆహారం జొన్న. ఆరోగ్యం మెరుగుపడాలంటే ఇది తప్పనిసరి. నగరంలో జొన్న రొట్టెలకు ప్రాచుర్యం ఇటీవల బాగా పెరిగింది. ఆరోగ్య అభిలాషులతో స్టార్ హోటళ్లలో కూడా జొన్న రొట్టెను తమ మెనూలో జోడించాయి. వీధుల్లో రూ.10కే లభిస్తున్న జొన్న రొట్టె పలు హోటళ్లలో వాటి స్థాయిని బట్టి రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఏ రొట్టెలైనా రెండు రోజులకు మించి ఉండవు. అదే జొన్న రొట్టెలకు ఆ సమస్య లేదు. కడక్ రోటీ అయితే వారం రోజులైనా తినవచ్చు. అది గట్టిగా ఉంటుంది. సాఫ్ట్ రోటీ మెత్తగా ఉంటుంది. వేడిగా ఉన్నప్పుడే తినాలి. జొన్నలను రోటీ రూపంలో మాత్రమే కాదు ఇడ్లీ, దోశ రూపంలో తినొచ్చు. ఊబకాయులు బరువు తగ్గేందుకు కూడా ఇది చక్కటి ఎంపిక. రాయచోటి పట్టణంలో మదనపల్లి రోడ్డు బీఎంఆర్ హోటల్ సమీపాన జగదాంబ సెంటర్ తదతర ప్రాంతాల్లో రొట్టెలు అమ్ముతున్నారు.

### పాస్‌పోర్టు పోయినది

నేతగాని వసంత తండ్రి నేతగాని మల్లికార్జున అడ్రస్ 7-178A, నూకనపల్లె గ్రామం, జివిపురం, ఓబులవారిపల్లె (మం) అన్నమయ్య జిల్లా, ఏ.పి. మా ఇంటి నుండి ఓబులవారిపల్లె మండల కేంద్రానికి స్కూటర్లో ప్రయాణిస్తుండగా నా పాస్‌పోర్టు నెం. R9357467 పోయినది. దొరికినచో పై అడ్రస్‌కు తెలియజేయగలరు.

## అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి అలవెన్స్‌లు ఇవ్వాలి

### ఏపి అంగన్‌వాడీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, అక్టోబర్ 20 ప్రభాతవార్త :**
రాష్ట్రంలోని అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులకుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ తెలిపారు. ఆదివారం అన్నమయ్యజిల్లా జనరల్ బాడీ సమావేశం సరోజమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులు కింద రూ.20వేలు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు రెగ్యులర్‌గా సరఫరా చేయాలని, మెనూ, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి గత సమ్మెకాలపు హామీలు అమలు చేయాలని ఆ మేరకు జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అనుబంధం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు మంజుల, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రామక్రిష్ణ, సాంబశివ, పిఎల్.నరసింహులు, సి.శ్రీనివాసులు, నాగేశ్వరీ, సరోజమ్మ, సుజాత, అనూరాధ, దుర్గా, విజయకుమారి, భారతి, రమణమ్మ, సీత, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడిన మాజీ రిజిస్ట్రార్ ఈసీని సస్పెండ్ చేయాలి

**కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20, ప్రభాతవార్త:**


వైసీపీ ప్రభుత్వంలో డా.వైఎస్ఆర్ అర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ మరియు వైవీయూ అక్రమ పద్ధతిలో తన రాజకీయ బలగంతో రిజిస్ట్రార్ కొనసాగిన ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి విశ్వ విద్యాలయంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని సస్పెండ్ చేయాలని కోరుతూ ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు మెయిల్ ద్వారా పంపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ వైఎస్ఆర్ అర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మాజీ రిజిస్ట్రార్‌గా ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి అక్రమ పద్ధతిలో కొనసాగాడని ప్రస్తుతం తిరిగి యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారన్నారు. వైవీయులో ప్రధానంగా ఔట్ సోర్సింగ్ పోస్టులు ఎటువంటి రోస్టర్ నోటిఫికేషన్ పద్ధతి లేకుండా ఇష్టానుసారంగా లక్షలాది రూపాయలు డబ్బులు తీసుకొని నాన్ టీచింగ్ మరియు డైలీ వెజ్ పోస్టులు భర్తీ చేశారన్నారు. అదే విధంగా వైవీయూలో కూడా అక్రమ పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ పోస్టులు మంజూరు చేశారన్నారు. వైవీయూ మాజీ ఉపకులపతి సూర్య కళావతి, చింతా సుధాకర్, రిజిస్ట్రార్‌లు వెంకట సుబ్బయ్య, విజయ రాఘవ ప్రసాద్‌లు కూడా తీవ్ర అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇవేకాక సురేంద్రనాథ్‌రెడ్డి, ఏఎఫ్‌యూలో నిధులు, విశ్వవిద్యాలయం అద్దె విషయంలో కూడా అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. ఈ విషయాలన్నీ ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్, పీడీఎస్‌యూ నగర నాయకుడు మనోజ్ పాల్గొన్నారు.

## దారుణాన్ని తీవ్రంగా ఖండించిన నాయకులు



**రైల్వే కోడూరు అర్బన్, అక్టోబర్ 20,ప్రభాతవవార్త :**
కడప జిల్లా బద్వేల్ శివారులో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న దస్తగిరమ్మ అనే దూదేకుల యువతిని దాసరి విగ్నేష్ అనే ప్రేమోన్మాది రేప్ చేసి దారుణంగా హతమార్చడాన్ని రైల్వే కోడూరు దూదేకుల సంఘం అధ్యక్షులు బోధనపు మహబుబ్ బాషా మరియు నూర్ బాషా సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. నిందుతుడిని తక్షణమే కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పెట్రోల్ పోసి దాడి చేయడం విచారకరమైన చర్య అని ఇటువంటి చర్యలు భవిష్యత్తులో ఇంకెవ్వరూ యుమరి విధంగా అతనికి సహకరించిన వారిని కూడా తీవ్రంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కాలేజీలో చదివే యువతీ యువకులు కు భయం ఉండే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు. అంతే గాకుండా మరణించిన దస్తగిరమ్మ కుటుంభాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని వారికి న్యాయం చేయాలన్నారు.

## డయల్ 100పై అపోహలు వద్దు

**కడప క్రైం, అక్టోబరు 20, ప్రభాతవార్త:**
అత్యవసర సేవలు అయిన డయల్ 100, 112లపై అపోహలు వద్దని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు జిల్లా ప్రజలకు సూచించారు. సమర్ధవంతంగా నెంబర్లు పనిచేస్తున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పాత కక్షలు మనసులో పెట్టుకొని ఇరువర్గాలు ఘర్షణ

**ముద్దనూరు, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**

ముద్దనూరు మండలంలోని సోంపల్లి గ్రామం నందు ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. వివరాల్లోకి వెళితే మూలే నాగ మునిరెడ్డి గతంలో భూ వివాదంలో ఏడాది క్రితం తమ తల్లిపై ఎర్రమరెడ్డి కృష్ణారెడ్డి దాడి చేయడాన్ని మనసులో పెట్టుకొని ఆదివారం నాడు కృష్ణారెడ్డి తోట పనుల నిమిత్తం వెళ్తుండగా మూలే మునిరెడ్డి కాపు కాసి కళ్లలో కారం చల్లి కృష్ణారెడ్డిపై దాడి చేశారు. ఈ దాడిలో కృష్ణారెడ్డికి మూగ దెబ్బలు తగిలాయి. ఈ విశయమై కృష్ణారెడ్డి అక్క కొడుకు రామాంజనేయ రెడ్డి మరి కొందరు మూలే మునిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి మునిరెడ్డి మరియు అతని తండ్రి జయరాం రెడ్డిపై దాడి చేయడం జరిగింది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలానికి సీఐ దస్తగిరి తోటి సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టి గాయపడిన వారిని 108 వాహణం ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రామకృష్ణా రెడ్డి, రామాంజనేయ రెడ్డిలను తరలించారు. మరో వర్గాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సీఐ దస్తగిరి దర్యాప్తు చేసి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గ్రంధాలయం తనిఖీ

**చాపాడు, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన చాపాడులోని గ్రంధాలయాన్ని జిల్లా గ్రంధాలయాల సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సెస్ బకాయిలు, గ్రంధాలయ అభివృద్ధి, పాఠకుల సభ్యత్వం అంశాలపై ఆరా తీశారు. గ్రంధాలయ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ నిర్వహణ అధికారి శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## దరియా సుజన్ కుమార్‌కు అంతర్జాతీయ అవార్డు




**యర్రగుంట్ల, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**
గ్లోబల్ టూరిజం అవార్డు 2024 అందుకున్న రాక్ ఈవెంట్స్ సంస్థ హైదరాబాదులోని హోటల్ తాజ్ డెక్కన్‌లో అక్టోబర్ 19న శనివారం ఆసియా ప్రైమ్ మీడియా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక గ్లోబల్ టూరిజం అవార్డును తెలంగాణ రాష్ట్ర పర్యాటక మరియు సాంస్కృతి శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు గారి చేతుల మీదుగా అందుకున్నట్లు దరియా సుజన్ కుమార్ తెలిపారు. పర్యాటక మరియు సాంస్కృతిక రంగాలలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు మరియు సంస్థలకు ఈ అవార్డులను ఆసియా ప్రైమ్ మీడియా సీఈఓ దివ్యా జయారామన్ గారి అధ్యక్షతన అందించారని ఆయన తెలిపారు. సుజన్ కుమార్ ఒక ఉపాధ్యాయుడుగా, మేజిషియన్‌గా, అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా, ఈవెంట్ మేనేజర్‌గా తనదైన ప్రతిభకు ఈ పురస్కారం నిదర్శణమని అన్నారు. 2008 సంవత్సరంలో రాక్ ఈవెంట్స్ సంస్థను స్థాపించి అనేక మంది కళాకారుల ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలలో భారతదేశ సంస్కృతిని ప్రతిబింబించే అనేక ప్రదర్శణలకు గానూ ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. రాక్ ఈవెంట్స్ ద్వారా మ్యాజిక్ షోస్, లైవ్ మ్యూజిక్, వెడ్డింగ్ ఈవెంట్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. థాయిలాండ్, సింగపూర్, మలేసియా, నేపాల్, లక్ష్యద్వీప్, మాల్దీవులు నుండి సుమారు 2500నామినేషన్లు రాగా అందులో టూరిజంలో ఇన్నోవేషన్ మరియు సుస్థిరత వైపు నిలచిన 30మందికి ఈ అవార్డు ఇవ్వగా అందులో రాక్ ఈవెంట్స్ కూడ ఉండటం సంతోషమని ఆయన అన్నారు. ఈ అవార్డు ద్వారా భారతదేశ పర్యాటకం మరియు సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రచురం చేసే బాధ్యత పెంచిందని సుజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుభాష్ దరియా, సుప్రదీప్, దినేష్, పీటర్ పాల్గొన్నారు.

## టక్కోలి తాత్కాలిక సర్పంచ్‌గా లక్ష్మీదేవి

**సిద్దవటం, అక్టోబరు 20, ప్రభాతవార్త:**
సిద్దవటం మండలం టక్కోలి గ్రామ పంచాయతీ తాత్కాలిక సర్పంచ్‌గా పోలుబోయిన లక్ష్మీదేవిని నియమించడం సరైన చర్య అని గ్రామ పంచాయతీ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ వారు ఏకకాలంలో రాజీనామాను సమర్పించడంతో తాత్కాలికంగా పోలుబోయిన లక్ష్మీదేవిని సర్పంచ్‌గా ఎన్నుకోవడం గ్రామాభివృద్ధికి ఎంతో ముఖ్యమరి వారి ద్వారా గ్రామ పంచాయతీ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులైన మెజార్టీ వార్డు మెంబర్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో గత 3 నెలలుగా సర్పంచ్ లేక అభివృద్ధి కుంటుపడుతుందని సర్పంచ్ ఎన్నుకోవడం ద్వారా అభివృద్ధి సాగుతుందని కావునా గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వహణ, వీధిలైట్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరాటకంకంగా సాగుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట తెదేపా పార్లమెంటరీ కార్యదర్శి అండ్లూరి నాగమునిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగమునిరెడ్డి మాట్లాడుతూ మెజార్టీ పాలకవర్గ సభ్యులు పోలుబోయిన లక్ష్మీదే వి సర్పంచ్‌గా ఎన్నుకున్నారని దానికి అనుగుణంగానే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు.

## కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

**సిద్దవటం, అక్టోబరు 20, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి వెంగమాంబ అమ్మవారు ఆశీస్సులు ఉండాలని ఆదివారం అమ్మవారి దర్శనం చేసుకున్నట్లు పంచాయతీ చాంబర్ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో కష్టపడుతున్నారని వారు చేసే ప్రతి పనిలో వెంగమాంబ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని తెలిపారు.

## కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

### - ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



**బద్వేలు అర్బన్, అక్టోబర్ 20 (ప్రభాతవార్త):**
బద్వేలులో ఓ యువకుడి చేతిలో గాయపడిన విద్యార్థిని దస్తగిరమ్మ మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి పాలనలో ఆడపిల్లలకు భద్రత లేకుండాపోయిందని, అధిక శాతంమంది హత్యలు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో మహిళలు సమిధలై పోతున్నారని వారికి ఈ ప్రభుత్వం భరోసా కల్పించలేకుండా పోతుందని, అలాగే లిక్కర్, ఇసుక స్కాములో నిండా మనిగిపోయిన ప్రజల రక్షణ బాధ్యతలనుపూర్తిగా గాలికొదిలేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో శాంతి,భద్రతలు కరువయ్యాయన్నారు. దాడులు, దౌర్జన్యాలతోరాష్ట్రం అల్లకల్లోంగా మారిందని ఇలాంటి దారుణ పరిస్థితులో గతంలో ఎప్పుడూ లేవన్నారు. ఇప్పటివరకు71మందిపై అత్యాచారాలు, లైంగిక దాడులకు పాల్పడ్డారు. వారిలో ఆరుమందిని అత్యాచారం చేసి హత్యలు చేశారు కూడా దాదాపు 200 మంది మహిళలు వేధింపులకు గురిచేశారన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అందులో ఉన్న మహిలా పోలీసులు వీరంతా కూడా మహిళలకు యువతలకు అండగా నిలిచారు. అదే దిశ యాప్ ఉండిఉంటే ఇవాల బద్వేలులో అమ్మాయి ఏదో ఒక రకంగా సహాయం పొంది ప్రాణాలు దక్కేవని ఐదు సార్లు ఫోన్‌చేసినా లేదా పోలీసులకు ఫోన్ చేసినా బాలికలకు రక్షణ లభించేదన్నారు. ఈ కేసు పూర్తిగా విచారణ చేసి నిందితుడినికఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ రమణారెడ్డి, మున్సిపల్‌చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు సుందరరామిరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు శ్రీరాములు, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెయ్యేరుకు జలకళ..

**రాజంపేట అర్బన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**

గత రెండేళ్లలో చెయ్యేరు నదిలో నీటి ప్రవాహం కనిపించకుండా పోయిన నేపథ్యంలో గత 5రోజులుగా కురిసిన వర్షాలతో చెయ్యేరుకు జలకళ వచ్చింది. సుండుపల్లె, వీరబల్లె, పీలేరు, మదనపల్లె ప్రాంతాలలో పడిన వర్షాలతో పాటు స్థానిక కొండల నుంచి కూడ వచ్చిన నీటితో చెయ్యేరు నదిలో 800క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. దీంతో పెనగలూరు మండలం చివరి వరకు చెయ్యేరు ప్రవాహం జోరుగా వెళుతోంది. ఆదివారం కావడంతో రాజంపేట, నందలూరు పరిసర గ్రామాల ప్రజలు, పర్యాటకులు నదిలో స్నానాలకు తరలివచ్చారు. ఉదయం నుంచే చెయ్యేరు జనంతో కళకళలాడింది. పలువురు భోజనాలు అక్కడే సిద్ధం చేసుకొని స్నానాలు చేసి సాయంత్రం చీకటి పడేవరకు ఉల్లాసంగా గడిపారు.

## బాధితురాలి తల్లిదండ్రులను పరామర్శించిన కొంకుల రాంబాబు



**బద్వేలు అర్బన్, అక్టోబర్ 20 (ప్రభాతవార్త):**
బద్వేలు పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన దస్తగిరమ్మ అదేవీధికి చెందిన విఘ్నేష్ పెట్రోలు పోసి హత్యచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మృతురాలి తల్లిదండ్రులైన హుసేన్, హేసేనమ్మను టీడీపీ సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు పరామర్శించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యాని ఒక దుర్మార్గుని దుశ్చర్యకు బలి కావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అం డగా ఉంటూ హంతకుడి శిక్ష పడేలా చేయాలని ఆయన అధికారులను కోరారు. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసేవారికి ఈ ఘటనలో పడడే శిక్ష హెచ్చరికగా ఉండాలన్నారు. బాధిత కుటుంబాన్ని పార్టీ ప్రభుత్వం అన్ని వి ధాలా ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## సుబ్బా నాయుడు మృతి పార్టీకి తీరని లోటు

### టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్ రాజు



**రాజంపేట అర్బన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**
చింతరాజు పల్లె మాజీ సర్పంచ్, ఒంటిమిట్ట రామాలయం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ బోడె సుబ్బా నాయు డు మృతి పార్టీకి తీరనిలోటని జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు పేర్కొన్నారు. పార్టీలో సీనియర్ నేతగా, వివాద రహితునిగా సుబ్బా నాయుడు పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆయప పేర్కొన్నారు. ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన సుబ్బా నాయుడు మృతి విశయం తెలుసుకొని జగన్‌మోహన్ రాజు తన జన్మదిన వేడుకలను రద్దు చేసుకొని సుబ్బానాయుడు నివాసానికి వెళ్లారు. సుబ్బా నాయుడు మృతదేహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. సుబ్బానాయుడు కుమారుడు లక్ష్మి నారాయణను ఓదార్చారు. మంచి ఆప్తున్ని కోల్పోయానని జగన్‌మోహన్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు.సుబ్బానాయుడు అంత్యక్రియల్లో జగన్‌రాజుతో పాటు రాష్ట్ర కల్లు గీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, సిద్ధవటం మాజీ జడ్పీటీసీ చలమయ్య యాదవ్, కొండమాజుపల్లె మాజీ సర్పంచ్ శ్రీహరి, శవనారు పల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహణం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**ముద్దనూరు, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**

ముద్దనూరు-పులివెందుల ప్రధాన జాతీయ రహదారిలో ఆదివారం పట్టణ పరిధిలోని బిఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో ద్విచక్ర వాహణంపై వెళ్తున్న తొండూరు మండలం పోతల పల్లె గ్రామానికి చెందిన యానాది శివ ప్రమాదవశాత్తు కింద పడి కాలుకు తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు తొండూరు మండలం పోతలపల్లె గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు సొంత గ్రామానికి వెళుతుండగా ఘటన జరిగినట్లు వివరించారు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఇరువురిని ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

## వాసవిక్లబ్ బెస్ట్ అధ్యక్షులుగా మేధాహల్ భార్గవ్

### - వనితాక్లబ్ బెస్ట్ అధ్యక్షురాలిగా అక్కిశెట్టి జ్యోతిర్మయి

### -వాసవి క్లబ్ అధ్యక్షులకు బెస్ట్ అవార్డు

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 20 (ప్రభాతావార్త):**


బద్వేలు పట్టణంలో వాసవిక్లబ్ అధ్యక్షులు మేధాహల్ బార్గవ్, వనితాక్లబ్ అధ్యక్షురాలిగా పట్టణంలో నిర్వహించిన సేవలను గుర్తించి అల్లాదుపల్లె దేవాలయం, వాసవి కళ్యాణమండపంలో జరిగిన పబ్బతి రీకాన్ కార్యక్రమంలో బద్వేలు వాసవి, వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు. వాసవిక్లబ్ బెస్ట్ అధ్యక్షులుగాభార్గవ్, వనితాక్లబ్ బెస్ట్ అధ్యక్షురాలిగా అక్కిశెట్టి జ్యోతిర్మయిలకు వాసవిక్లబ్ రీజన్ చైర్మన్ పబ్బతి గోపాల్ చేతుల మీదుగాఅవార్డు అందజేశారు. పట్టణంలో అనేక సంవత్సరాలుగా నిరుపేద వైశ్యులకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో జిల్లాలోనే ముందంజలో ఉందని రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని వారు కోరారు. అనంతరం సెక్రటరీ పెసల సుధాకర్ ,వనితాక్లబ్ సెక్రటరీ పబ్బతి శ్రీదేవిలకు వాసవిమాత ప్రతిమను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైభవ్ ప్రసాద్, కొండపల్లి సుభాష్‌కుమార్, చాటకొండు వెంకట సుబ్బయ్య, అక్కిశెట్టి ప్రవీణ్‌కుమార్ పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి ప్రతిభా అవార్డు

**వేంపల్లె, అక్టోబరు 20, ప్రభాతవార్త :**
ఇడపులపాయ ట్రిపుల్‌ఐటీ రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్‌కు ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డును గుంటూరులోని ఆంధ్ర క్రిష్టియన్ కళశాలలో ఆదివారం ప్రదానం చేశారు. శాసనమండలి సభ్యులు లక్ష్మణరావు చేతుల మీదుగా ప్రభాకర్ ప్రతిభా అవార్డు అందుకున్నారు.



## పిడుగుపాటుకు 18 పొట్టేళ్లు మృతి

**గాలివీడు, అక్టోబర్ 20(ప్రభాతవార్త):**

మండలంలోని తూముకుంట గ్రామం నాయునివారిపల్లెలో పిడుగుపాటుకు 18 పొట్టేళ్లు మరణించినట్లు పాడి రైతు కొర్రు రామప్పనాయుడు వాపోయాడు. ఆదివారం సాయంత్రం నాయునివారిపల్లె తూర్పు వైపున తెల్లకొండ సమీపంలోని పంట పొలాల్లో పొట్టేళ్లు మేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో 18 పొట్టేళ్లు విగతజీవులు అయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టేళ్ల విలువ దాదాపు రూ.2.50 లక్షల విలువ ఉంటుందని ఇంత పెద్దమొత్తం నష్టపోవడంతో తన కుటుంబం అప్పులపాలు అవుతుందని రైతు బోరున విలపించారు. సంఘటన తెలిసిన వెంటనే సర్పంచ్ కుమార్‌నాయుడు, వీఆర్ఓ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ భద్రప్పనాయుడు, టీడీపీ కదిరెడ్డినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహారాన్ని అందించాలని పాడిరైతు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**కలికిరి, అక్టోబరు 20, ప్రభాతవార్త:**
మండలంలోని కొటాల సమీపంలో తమ ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన గాయపడిన వ్యక్తి రామచంద్రయ్య(45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మర్రికుంటపల్లె పంచాయతీ గాజులబండ కురవపల్లెకు చెందిన రామచంద్రయ్య తన సొంత పనుల నిమిత్తం కలికిరి మండల కేంద్రానికి వచ్చి తిరిగి తన గ్రామానికి స్కూటరులో వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. బలమైన రక్తగాయాలు కావడంతో అతన్ని కుటుంబ సభ్యులు తిరుపతి రుయాకు తరలించి చికిత్సలు అందించారు. అక్కడ చికిత్స పొందుతూ రామచంద్ర మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన కుటుంబాన్ని పోషించే యజమాని మృతి చెందడంతో ఆయన కుటంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయం



**పెండ్లిమర్రి, అక్టోబరు 20, ప్రభాతవార్త:**
మండలంలోని తోగలపల్లె, నందిమండలం గ్రామ పంచాయతీల్లో కమలాపురం ఎమ్మెల్యే పల్లె పండగ వారోత్సవాలలో భాగంగా రోడ్లకు భూమిపూజ చేశారు. కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని అందుకోసం గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మౌలిక వసతులు అయిన డ్రైనేజీ, మురికి కాలువలు, తాగునీటి వసతులు తదితర వాటిని ఏర్పాటు చేయడం జరుగోతందన్నారు. మండలానికి రూ.2.91కోట్లు నిధులు మంజూరయ్యాయని అందులో భాగంగా తోగలపల్లె, నందిమండలంలోని సీసీ రోడ్లకు రూ.30లక్షలు వరకు నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ఛార్జి పీడీ విజయ్‌కుమార్, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, కొత్తూరు కిశోర్‌రెడ్డి, నందిమండలం శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో పేకాటపై నిఘా:ఎస్సై నవీన్

**రైల్వేకోడూరు,అక్టోబర్ 20,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో పేకాట ఆడుతున్న వారి పై ప్రత్యేక నిఘా ఉంచామని పూర్తిస్థాయిలో వాటిని నిర్మూలిస్తున్నామని ఎవరైనా వాటిపై ఆసక్తి చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వేకోడూరు ఎస్సై నవీన్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి,సి ఐ ల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘాను ఉంచామని అసాంఘిక కార్యక్రమాల పై ఎవరైనా దొరికితే కఠినంగా శిక్షలు ఉంటాయని ఆయన అన్నారు.తాగి వాహనాన్ని నడిపితే కేసును నమోదు చేస్తామని అన్నారు.రాత్రి వేళల్లో ఆటో డ్రైవర్లు సంబంధిత ఐడి కార్డు డ్రైవింగ్ లైసెన్స్ తప్పక ఉంచుకోవాలని గ్రామీణ ప్రాంతాలలో రైతులు ట్రాన్స్ఫార్మర్లు దొంగలించబడుతున్నాయని సమాచారం రావడంతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా అటువంటి చట్టపరమైన నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి జ్యోతి ఉత్సవాలలో మంత్రి సతీమణి

**చిన్నమండెం, అక్టోబర్ 20, ప్రభాతవార్త :**

రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ, కుమార్తె నాగ వైష్ణవి శనివారం దిగువగొట్టివీడు గ్రామం రామాపురంలో నిర్వహించిన శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు వారికి భక్తిశ్రద్దలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశ్వీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక




**లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్20, ప్రభాతవార్త:**
ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు) అన్నమయ్య జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సూర్యుడు నాయక్, ఉమామహేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాయచోటి డైట్ పాఠశాల నందు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కరుణానిధి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా అహమ్మద్ ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు ముందుండి పోరాడతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంశ్వేరి, వెంకట శివారెడ్డి, రాష్ట్ర సిపిఎస్ కన్వీనర్ అరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి తీర్థం పుచ్చుకొన్న రాచవేటివారిపల్లె సర్పంచ్

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రమణ్యంతో పాటు మరో ఇద్దరు వార్డు సభ్యులు ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రాచవేటివరాఇపల్లెలో పర్యటించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో వారు వైసిపి నుంచి టిడిపిలోకి చేరారు. ఎమ్మెల్యే వారికి టిడిపి కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు.

